
జన్మదిన శుభాకాంక్షలు
మా ప్రియతమ నాయకుడు,
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ॥శ్రీ నారా చంద్రబాబు
నాయుడు గారికి
జన్మదిన శుభాకాంక్షలు
తెలుపుకుంటూ..
బోనెల విజయచంద్ర
శాసనసభ్యులు, పార్వతీపురం నియోజకవర్గం


జన్మదిన శుభాకాంక్షలు
నిత్య కృషీవలురు... అలుపెరగని పోరాట యోధులు..
ప్రజల మనిషి... అభివృద్ధి ప్రధాత..
సంక్షోభాన్ని సంక్షేమంగా మార్చే మేధావి...
సంపద సృష్టికర్త... తెలుగు ప్రజల నమ్మకం..
జనం మెచ్చిన నాయకులు.. గౌరవ ముఖ్యమంత్రి..
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
గౌ॥శ్రీ॥ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
బోనెల విజయచంద్ర
శాసనసభ్యులు, పార్వతీపురం నియోజకవర్గం

ఇక శివారుకు సాఫీగా సాగునీరు

- తోటపల్లి కుడి ప్రధాన కాలువ అభివృద్ధికి చర్యలు
- పనులకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం



ఉల్లిభద్ర పరిధిలోని కుడి ప్రధాన కాలువ



కాలువకు అడ్డంగా వేసిన మట్టి

గరుగుబిల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని కుడి ప్రధాన కాలువపై ప్రభుత్వం దృష్టి సారించింది. దాని పరిధిలో పిచ్చి మొక్కలు, పూడికతీతలతో పాటు రాళ్ల తొలగింపునకు రూ. 2.93 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర విపత్తుల సహాయ నిధిలో భాగంగా నిధులు కేటాయించగా.. ఉల్లిభద్ర పరిధిలోని జీరో కిలో మీటరు నుంచి తెర్లాం పరిధిలోని 48వ కిలో మీటరు వరకు కాలువ అభివృద్ధి పనులు నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్వతీపురం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎనిమిది పనుల నిర్వహణలో అధికారులు నిమగ్నమయ్యారు. నీరు దిగువకు రాకుండా ప్రధాన కాలువ పరిధిలో అడ్డంగా మట్టి వేశారు. గుర్రపు డెక్కతో పాటు పిచ్చి మొక్కల పనులు ప్రారంభం కావడంతో రానున్న ఖరీఫ్‌కు సాగునీటి సరఫరాకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని ప్రాజెక్టు జేఈ బి.కిషోర్‌కుమార్ తెలిపారు. పనుల నిర్వహణకు టెండర్ల ప్రక్రియ పూర్తికావచ్చిందన్నారు. గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో కొంతమేర పనులకు ఆటంకం నెలకొందని తెలిపారు. నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని స్పష్టం చేశారు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఉల్లిభద్ర ప్రాంతంలో కుడి ప్రధాన కాలువను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ కాలువల అభివృద్ధిని పట్టించుకోలేదు. కనీసం వాటి నిర్వహణకు నిధులు కూడా మంజూరు చేయలేదు. దీంతో పూడికలు, పిచ్చి మొక్కలతో కాలువలు అధ్వానంగా మారాయి. ఈ క్రమంలో దిగువ ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. కాలువ గుండా పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసిన సమయంలో పలు ప్రాంతాల్లో గండ్లు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వాటిపై దృష్టి సారించడంతో ఆయకట్టుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పనుల నిర్వహణకు సర్వేతో పాటు కొలతలు వేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

సామాజిక వర్గాలకు అండగా..



- కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం
- స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు


పార్వతీపురం, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ, ఎస్సీ తదితర సామాజిక వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారికి స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఈ మేరకు వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాల మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జిల్లాలో బీసీ సామాజిక వర్గాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులందరికీ రుణాలు మంజూరయ్యే విధంగా బ్యాంకులకు సిఫారసులు వెళ్లాయి. త్వరలోనే ఆయా లబ్ధిదారులకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు కానున్నాయి. 2025- 26కు సంబంధించి 2,929 మంది బీసీ లబ్ధిదారులకు రూ.35 కోట్లను సబ్సిడీపై రుణాలను అందించనున్నారు. ఇటీవల జ్యోతిబా పూలే జయంతి వేడుకల సందర్భంగా బీసీ కార్పొరేషన్ ద్వారా 124 మందికి రూ. 2.70 కోట్ల విలువ చేసే వ్యవసాయ ఇతర పనిముట్లు అందించారు.



మంత్రి గుమ్మిడి సంధ్యారాణి , కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, జేసీ శోభిక, పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ తదితరుల చేతులు మీదగా పంపిణీ చేపట్టారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 266 మందికి రూ.11.53 కోట్లతో స్వయం ఉపాధి కల్పిచేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు సబ్సిడీతో కూడిన రుణాలను అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇతర సామాజిక వర్గాల్లో పేదలకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వాస్తవంగా గత ఐదేళ్లలో వివిధ కార్పొరేషన్లు దిష్టిబొమ్మల్లా మారాయి. వాటి చైర్మన్లు, డైరెక్టర్లు గౌరవ వేతన పొందేం దుకు మాత్రమే పరిమితమయ్యారు. వాటి ద్వారా రుణాలు మంజూరు చేయించలేని పరిస్థితుల్లో ఉంటూ పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. ఏదేమైనా వైసీపీ హయాంలో నిర్వీర్యమైన కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం పూర్వవైభవం తేవడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన అవసరం: కలెక్టర్

పార్వతీపురం, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన అవసరమని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వల్ల రైతులు అధిక దిగుబడులు, రాబడిని పొందొచ్చు. జిల్లాలో 51 శాతం వ్యవసాయ ఆధారిత ప్రాంతం. 70 శాతం జనాభా వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన వ్యవసాయ అనుబంధ రంగాలు ఒక యూనిట్‌గా పనిచేసి 16 శాతం వృద్ధిని సాధించాలి. గత ఏడాది రాగి, కంది, మొక్కజొన్న పంటలను ప్రోత్సహించాం. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి 48 గంటల్లోగా చెల్లింపులు చేశాం. ఫాంపాండ్స్ ఏర్పాటుకు రైతులు ముందుకు రావాలి. బిందు సేద్యం యూనిటట్లపై గిరిజన రైతులకు శతశాతం, ఇతరులకు 90 శాతం వరకు సబ్సిడీ ఉంది. ఏనుగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. మరో రెండు నెలల్లో చెక్‌డ్యామ్‌లు, కెనాల్స్ మరమ్మతు పనులు పూర్తి చేయిస్తాం.' అని తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ సత్యనారాయణ, అప్పలస్వామి, జి.శివనారాయణ, జిల్లా ఉద్యాన శాఖాధికారి బి.శ్యామల, ఏపీసీఎన్ఎఫ్ అధికారి షన్ముఖ, ప్రాజెక్టు వ్యవసాయాధికారి జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వివిధ పంటలపై అవగాహన పత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తదితరులు

శాస్త్రీయంగా ఈ-వ్యర్థాల రీసైక్లింగ్

ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు, గృహాల్లో పాడైన ఎల క్ట్రానిక్ పరికరాలు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను శాస్త్రీయంగా రీసైక్లింగ్ చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్లో ఉన్న ఇ-వ్యర్థాలను మున్సిపల్ కార్యాలయ చెత్త సేకరణ వాహనంలోకి డంప్ చేయించారు. ఇటువంటి వ్యర్థాలను గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు. జేసీ శోభిక , డీఆర్వో కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ

- నేడు నోటిఫికేషన్ జారీ చేయనున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 583 పోస్టుల భర్తీ
- నిరుద్యోగుల్లో ఆనందోత్సాహాలు

విజయనగరం/కలెక్టరేట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మెగా డీఎస్సీకి ఆదివారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. దీంతో నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు ఉపాధ్యాయ పోస్టుల భర్తీని విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. టెట్ నిర్వహించి నవంబరులోనే ఫలితాలు ప్రకటించింది. ఇటీవల సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో జూన్‌నాటికి పోస్టుల భర్తీని పూర్తి చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో 583 ఉపాధ్యాయ పోస్టులు (137 గిరిజన ఆశ్రమ పాఠశాల లను కలుపుకొని) భర్తీకానున్నాయి. స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులతో పాటు వివిధ గురుకులాలు, రెసిడెన్సీ, మోడల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారు.





గర్భిణుల వసతిగృహంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

వైద్య సేవలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

గరుగుబిల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో రోగులకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. శనివారం గరుగుబిల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. అత్యవసర వైద్యం కోసం వచ్చిన వారిని ప్రాణా పాయం నుంచి బయటపడేలా చేయాలన్నారు. నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, విద్యుత్ ఉపకరణాలను దూరంగా ఉంచాలని తెలిపారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రం ప్రాంగణాన్ని సిబ్బందితో కలిసి శుభ్రపర్చారు. పలు రకాల మొక్కలను నాటారు. స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి టి.జగన్మోహన రావు మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ఎలక్ట్రానిక్ వ్యర్థాల ప్రభావంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని 37 పీహెచ్‌సీలు, ఐదు అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

గిరిజన గర్భిణుల వసతిగృహం పరిశీలన

సాలూరు: పట్టణంలోని గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని డీఎంహెచ్‌వో భాస్కరరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న వైద్యం, ఆహారం తదితర వాటిపై ఆరా తీశారు. టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గర్భిణులకు ఆరోగ్య సమస్యలేమైనా ఉంటే ప్రాంతీయ ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు.

వైస్ ఎంపీపీపై కేసు నమోదు

- విధులకు అడ్డుతగులుతున్నారని ఉపాధి ఏపీవో ఫిర్యాదు
- ఆ వైసీపీ నేత బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వెల్లడి

సాలూరు, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): సాలూరు మండలానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, పెదపదం ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్‌కుమార్‌పై కేసు నమోదైంది. తన విధులకు ఆటంకం కలిగించడంతో పాటు నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని ఉపాధి హామీ పథకం ఏపీవో టి.రామకృష్ణ ఆయనపై శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ అప్పలనాయుడు అదే రోజు రాత్రి సురేష్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. దీనిపై శనివారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న ఎంపీడీవో కార్యాలయంలో నార్లవలస, బొరబంద, శివరాంపురం సర్పంచ్‌ల ఎదుట ఏపీవోపై వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులకు సంబంధించి పనులే మాత్రమే చేస్తూ.. వారికి లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నారని లేనిపోని మాటలతో దుర్భాషలాడారు. అంతే కాకుండా ఏపీవోపై కుర్చీ ఎత్తి కొట్టేందుకు ప్రయత్నించారు. 'ఈ మండలంలో ఎలా ఉద్యోగం చేస్తావో చూస్తా.. నీ అంతు తెలుస్తా'.. అని బెదిరించారు. పెదపదం పంచాయతీలో ఉపాధి హామీ పనులు చేయనీయడం లేదని, దీంతో ఉన్నతాధికారుల నుంచి తనపై ఒత్తిడి ఉందని ఏపీవో ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ వెల్లడించారు. దీనిపై దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

గంజాయితో పట్టుబడిన విద్యార్థులు

- కంచేడువలసలో కొనుగోలు చేసినట్లు పోలీసులకు వెల్లడి
- ముమ్మరంగా దర్యాప్తు

బొబ్బిలి/మక్కువ ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో మూడు రోజుల కిందట ముగ్గురు విద్యార్థులు గంజాయితో పట్టుబడ్డారు. వారి భవిష్యత్ నాశనం కాకూడదనే ఉద్దేశంతో పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. విద్యార్థులను విచారించగా పలు విషయాలు వెలుగు చూశాయి. మక్కువ మండలం కొయ్యానపేట పంచాయతీ కంచేడువలస గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి విద్యార్థులు గంజాయిని కొనుగోలు చేసినట్లు తేలింది. దీంతో బొబ్బిలి పోలీసులు మక్కువ పోలీసుల సహకారంతో కంచేడువలస వెళ్లి గంజాయి సాగుచేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీఐ కటకం సతీష్‌కుమార్, ఎస్ఐ రమేష్ ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

ఇదేం తీరు!

- ఏపీ కార్మికులను అదుపులోకి తీసుకున్న ఒడిశా పోలీసులు
- పొట్టంగి స్టేషన్‌కు తరలింపు
- ధూళిభద్రలో జేజేఎం పనులు చేపట్టడమే తప్పా?
- కొఠియా ఒడిశా పోలీస్‌స్టేషన్ ముందు గిరిజనుల బైఠాయింపు

సాలూరు రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సాలూరు మండల పరిధి వివాదాస్పద కొఠియా గ్రూప్ గ్రామం ధూళిభద్రలో ఏపీ జల్‌జీవన్ మిషన్ పనులపై మరోసారి ఒడిశా అధికారులు అక్కసు వెళ్లగక్కారు. జేజేఎంలో భాగంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు రంగులు వేస్తున్న ముగ్గురు కార్మికులను ఒడిశా పోలీసులు అదుపులోకి తీసుకుని పొట్టంగి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. దీనిపై స్థానిక గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొటారుబిల్లికి చెందిన పెయింటర్ శివ, సహాయకులుగా సాలూరు మండలం ధూళిభద్రకు చెందిన చోడిపల్లి సుబ్బారావు, చోడిపల్లి నర్సులు ధూళిభద్రలో వాటర్ ట్యాంక్‌కు శనివారం పెయింటింగ్ పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఒడిశా రాష్ట్రం పొట్టంగి రెవిన్యూ, సమితి అధికారులు ఒడిశా పోలీసులతో అక్కడకు వెళ్లి వారిని తీసుకెళ్లిపోయారు. దీంతో ధూళిభద్ర, ఎగువశెంబి, దిగువశెంబి గిరిజనులు ఒడిశాకు చెందిన కొఠియా పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. తమ వారిని ఎందుకు నిర్బంధించి.. పొట్టంగి పోలీస్‌స్టేషనుకు తరలించారని ప్రశ్నించారు. తమ వారిని విడిచిపెట్టేవరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. రాత్రి ఎనిమిది గంటల వరకు గిరిజనులు కొఠియా ఒడిశా పోలీస్‌స్టేషన్ నుంచి కదలలేదు. గంజాయిభద్ర గిరిజన నేతలు గెమ్మెల బీసు, రాజేష్ తదితరులు పొట్టంగి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులతో మాట్లాడారు. మరోవైపు ఏపీకి చెందిన కొఠియా పోలీసులు ఒడిశా కొఠియా పోలీసుస్టేషన్‌కు వెళ్లి అక్కడి వారితో చర్చించారు. ఒడిశా అధికారులు సైతం అక్కడ పరిస్థితిని కోరాపుట్ జిల్లా ఉన్నతాధికారులకు వివరించారు. పొట్టంగి పోలీస్‌స్టేషన్ నుంచి వారి తీసుకురావడానికి కొఠియా నుంచి ముగ్గురు బైక్‌లపై వెళ్లారు. మరోవైపు రాత్రయినా ఏపీ కొఠియా పోలీసులు అక్కడే వేచి ఉన్నారు. అనంతరం ముగ్గురు కార్మికులనూ విడుదల చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.




కార్మికులను విడుదల చేయాలని ఒడిశా కొఠియా పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన గిరిజనులు



నేడు సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు

సాలూరు, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. ఉదయం 9 గంటలకు పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో చంద్రబాబు పేరిట ప్రత్యేక పూజలు చేయనున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద కేక్ కటింగ్, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, అన్న, వస్త్రదానాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు.

మెగా డీఎస్సీ



- నేడు నోటిఫికేషన్ జారీ చేయనున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 583 పోస్టుల భర్తీ
- నిరుద్యోగుల్లో ఆనందోత్సాహాలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తీపి కబురు అందించారు. డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి అనుమతి ఇస్తూ పాఠశాల విద్యాశాఖ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఎన్నికల ముందు మాత్రం హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తక్కువ ఉద్యోగాలకు ఇవ్వడంపై అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు ఆందోళనలు చేశారు. తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ప్రచారంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అనుకున్నట్లే సీఎం కాగానే డీఎస్సీ ఫైలుపై తొలిసంతకం చేశారు. ఆదివారం ఉదయం నోటిఫికేషన్ జారీ కానుంది. అభ్యర్థుల వయో పరిమితి కూడా గరిష్టంగా రెండేళ్లు పెంచడంతో అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

(పూర్తి వివరాలు 6వ పేజీలో...)

పరిసరాల పరిశుభ్రత.. అందరి బాధ్యత

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో మంత్రి సంధ్యారాణి

8లో



సాలూరు ఎంపీడీవో కార్యాలయంలో చెత్త ఊడ్చుతున్న మంత్రి సంధ్యారాణి

వైస్ ఎంపీపీపై కేసు నమోదు

- విధులకు అడ్డుతగులుతున్నారని ఉపాధి ఏపీవో ఫిర్యాదు
- ఆ వైసీపీ నేత బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వెల్లడి

6లో

ఇక శివారుకు సాఫీగా సాగునీరు

- తోటపల్లి కుడి ప్రధాన కాలువ అభివృద్ధికి చర్యలు
- పనులకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం



ఇదేం తీరు!

- ఏపీ కార్మికులను అదుపులోకి తీసుకున్న ఒడిశా పోలీసులు
- పొట్టంగి స్టేషన్‌కు తరలింపు
- ధూళిభద్రలో జేజేఎం పనులు చేపట్టడమే తప్పా?
- కొరియా ఒడిశా పోలీస్‌స్టేషన్ ముందు గిరిజనుల బైఠాయింపు

6లో

సామాజిక వర్గాలకు అండగా..

- కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం
- స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు

ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన అవసరం

- వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

6లో

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం పరశురాంపురం గ్రామానికి చెందిన రఘుమండల ఫకీరునాయుడుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షల 53వేల మంజూరయ్యాయి. ఈ చెక్కును ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్య క్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండల వాసులు పలు సమస్యలపై ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం వినతిపత్రాన్ని అందించారు. కళ్లికోట గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. పరశురాంపురం గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేయాలన్నారు. సీసీ రోడ్డు, సైడ్ వాల్ నిర్మించాలని, లంజి గ్రామం నుంచి కుంతేస్ పంచాయతీ గూనకల్లుకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు.

ఆర్బీఎస్కే రిఫరల్ వాహనం ప్రారంభం

పార్వతీపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా పిల్లల్లో ఆరోగ్య లోపాలను గుర్తించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఏర్పాటు చేసిన రిఫరల్ వాహనాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం పార్వతీపురంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లల్లో పుట్టుకతో ఎదుగుదల క్రమంలో లోపాలు, వైకల్యాలను త్వరగా గుర్తించాలన్నారు. తగు చికిత్స ద్వారా లోపాన్ని సరిచేస్తే జీవన ప్రమాణాలు మెరుగుపడడంతో పాటు పిల్లలకు ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటు అవుతుందని ఆయన అన్నారు. జిల్లాలో వివిధ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇటువంటి లోపాలు ఉన్న 479 పిల్లలను గుర్తించామని, వారికి జిల్లా కేంద్రంలో ఉన్న బాలల సత్వర చికిత్సా కేంద్రంలో చికిత్స, ఆరోగ్య పర్యవేక్షణ అందిస్తారని చెప్పారు. ఆరోగ్య కేంద్రాల నుంచి డీఈఐసీ కేంద్రా నికి పిల్లలను తీసుకొచ్చి చికిత్స అందించేలా చూడాలని ఆయన సూచించారు.

సమాజానికి పనికొచ్చే ప్రాజెక్టులు తయారు చేయాలి

సీతంపేట రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే ప్రాజెక్టులను తయారు చేయాలని జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు సూచించారు. శనివారం స్థానిక ఏపీఆర్ బాలుర గురుకుల పాఠశాలలో అటల్ టింకరింగ్ లాబ్స్ బూట్ క్యాంప్ నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ బూట్ క్యాంప్‌లో చివరిరోజు ముగింపు కార్యక్రమానికి డీఎస్‌వో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌కు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందించడానికి కృత నిశ్చయంతో పనిచేస్తున్నాయని అన్నారు. ఏఎంవో కోటిబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ నీలంనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొరడ కెనరా బ్యాంకు భవనం పీసా కమిటీ వశం

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గొరడ గ్రామంలో గత పదేళ్లుగా కెనరా బ్యాంకును పైసా అద్దె చెల్లించకుండా గిరిజనులకు చెందిన కమ్యూనిటీ భవనంలో నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో శనివారం ఈ భవనాన్ని అధికారులు పీసా కమిటీకి అప్పజెప్పారు. ఏప్రిల్ నెల నుంచి ప్రతి నెలా రూ.6,800 చొప్పున అద్దె చెల్లించాలని గొరడ పీసా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు నాగూరు మాజీ ఎమ్మెల్యే, గొరడ గ్రామ పెద్ద కోలక లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో శనివారం గొరడ గ్రామంలో నిర్వహించిన పీసా కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఐపాడ్ నిధులతో గొరడ గ్రామంలో ఉన్న గిరిజనుల అవసరాలకు కమ్యూనిటీ భవనాలను నిర్మించామని, అయితే ఆ భవనంలో పదేళ్ల కిందట కెనరా బ్యాంకు ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయమై పలుమార్లు పార్వతీపురం ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకెళ్లామని, ప్రస్తుతానికి తమ కోరిక నెరవేరిందన్నారు. కెనరా బ్యాంకు ఇచ్చిన అద్దెతో దేశ కమిటీ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తామన్నారు.

పట్టపగలే చోరీ

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పెద్దబొండపల్లి గ్రామంలో శనివారం పట్టపగలే దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన పెద్దింటి వెంకటనాయుడు తన భార్య లలితతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లిన సమయంలో ఈ దొంగతనం జరిగినట్టు భావిస్తున్నారు. ఈ ఘటనలో సుమారు పది తులాల బంగారం, కొంత నగదు పోయినట్టు బాధితులు చెబుతున్నారు. అందిన ఫిర్యాదు మేరకు ట్రైనీ ఎస్ఐ డి.ధనుంజయ పెద్దబొండపల్లి చేరుకున్నారు. వెంకటనాయుడు ఇంటిలో పరిశీలించారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తు న్నారు.

లాకౌట్ చట్ట విరుద్ధం

కొత్తవలస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జేఎస్ఎల్ కర్మాగారంలో యాజమాన్యం విధించిన లాకౌట్ చట్ట విరుద్ధమని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను కోరారు. శనివారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సమక్షంలో కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిగాయి. 57 మంది కార్మికులకు మాత్రమే లే ఆఫ్ ఇస్తామని చెప్పడం కార్మిక చట్టాలకు విరుద్ధమని కార్మిక సంఘాల నాయకులు అన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నిర్లక్ష్యం చేయకండి

చీపురుపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాలను నిర్లక్ష్యం చేయకూడదని డీఎల్‌డీవో హేమసుందర్ అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం పంచాయ తీ కార్యాలయంలో వ్యర్థాల సేకరణపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అత్యంత ప్రమాద కరమైన వన్నారు. ఎంపీడీవో ఇ.సురేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులు దేవుడితో సమానం


దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

- మంత్రి సంధ్యారాణి ● ఉపకరణాల పంపిణీ

సాలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు దేవుడితో సమానమని, వారికి చేతనైనంత సేవ చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరా లు గల విద్యార్థులకు ఆమె ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజాదర్బార్‌లో ఎంతో మంది తల్లిదండ్రుల కోరిక మేరకు జిల్లాకు 170 (వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్) ఉపకరణాలు మంజూరు చేయించామని చెప్పారు. సాలూరు నియోజకవర్గానికి 20 ఉపకరణాలు వచ్చాయన్నారు.

మున్సిపాల్టీని చూస్తే ఉన్న ఉత్సాహం పోతుంది

నియోజకవర్గంలో నాలుగు మండలాలు అభివృద్ధి చెందుతుంటే మున్సిపాల్టీ మాత్రం అస్సలు అభివృద్ధి చెందటం లేదని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలు నిధులు తెస్తున్నా వాటిని ఖర్చు చేసే నాథుడే లేడని అన్నారు. మున్సిపాల్టీని చూస్తే ఉన్న ఉత్సాహం కూడా పోతుందని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ● రానున్న శ్యామలాంబ అమ్మవారి పండగకు పూర్తి స్థాయిలో పారిశుధ్యం, తాగునీటికి ఇబ్బందులు లేకుండాలని చేయాలని సూచించారు. విద్యుత్ శాఖలో కోటి రూపాయలు నిధులతో 12 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయటంతో పాటు 52 విద్యుత్ స్తంభాలను అమర్చామని చెప్పారు. నూతనంగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకోండి

బెలగాం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకోవాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వారి తల్లిదండ్రులను కోరారు. పార్వతీపురంలోని డీవీఎం పాఠశాలలో సమగ్ర శిక్షణ అభియాన్ ఆధ్వర్యంలో అలిమ్‌కో సహకారంతో అందిస్తున్న ఉపకరణాలను ఆయన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శనివారం పంపిణీ చేశారు. పిల్లలతో స్వయంగా మాట్లాడి వారిని ఉత్తేజపరిచారు. కుర్చీలు, బ్రెయిలీ కిట్, సీపీ వీల్‌చైర్లు, ట్రై సైకిల్ తదితర 173 పరికరాలను పంపిణీ చేశారు. ముందుగా ఒక ప్రైవేటు సామాజిక సేవా సంస్థ విద్యార్థుల కోసం వితరణ చేసిన ఆట వస్తువులను ప్రారంభించారు. కొప్పుల వెలమ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, టీడీపీ నాయకులు జయబాబు, కౌన్సిలర్లు బడే గౌరునాయుడు, మధు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత.. అందరి బాధ్యత


సీతానగరం: మొక్కలు నాటుతున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పాలకొండ: నగర పంచాయతీ కార్యాలయం ముందు ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ రత్నంరాజు

- జిల్లా వ్యాప్తంగా స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర

సాలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం అందరి బాధ్యతని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ప్రాంగణంలో చీపురు పట్టుకుని చెత్తను ఊడ్చారు. అనంతరం అధికారులు, నాయకులతో కలిపి ప్రతిజ్ఞ చేయించారు. ● మండలంలో ఉన్న అన్ని శాఖలు, సచివాలయ సిబ్బందితో ఈనెల 23న మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం నిర్వహించాలని ఎంపీడీవో పార్వతికి మంత్రి ఆదేశించారు. ఆమె వెంట టీడీపీ మండల అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కూర్మారాజుపేట సర్పంచ్ నళిని, ఖరాసువలస ఎంపీటీసీ అప్పికొండ రమాదేవి ఉన్నారు.

● పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ-వేస్టుతో సంపద సృష్టిపై శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

● సీతానగరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుందామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండల కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రజలు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో కూరగాయలు పండించాలని సూచించారు. అనంతరం పలువురు ఉపాధి హామీ వేతనదారులు కలెక్టర్‌ను కలిసి, బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే మండల వెలుగు సమాఖ్య కేంద్రం కావాలని పలువురు కోరారు. జిల్లా ప్రత్యేకాధికారి భరత్‌కుమార్ గుప్తా, అధికారులు పాల్గొన్నారు.

● పాలకొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని నగర పంచాయతీ కమిషనర్ ఎస్‌జేవీ రత్నంరాజు అన్నారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రాపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను ఈ-సెంటర్‌లో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ హేమంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ఇన్‌చార్జి మాకొద్దు!


నిరసన ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు

- భూదేవిని వ్యతిరేకించిన తెలుగు తమ్ముళ్లు

పాలకొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 'ఈ నియోజకవర్గ ఇన్‌చార్జి మాకొద్దు..' అంటూ తెలుగు తమ్ముళ్లు నినదించారు. శనివారం స్థానిక కల్యాణ మండపంలో పాలకొండ నియోజకవర్గ క్లస్టర్, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూదేవిని తక్షణమే మార్చాలని నాలుగు మండలాల టీడీపీ కార్యకర్తలు, నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో ఆమె చేసింది ఏమీ లేదని, ఎన్నికల సమయంలో వైసీపీకి కోవర్ట్‌గా వ్యవహరించి జనసేన అభ్యర్థి, కూటమి నాయకత్వానికి వ్యతిరేకంగా పనిచేశారని వారు వెల్లడించారు. ఈ క్రమంలోనే పార్టీ అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు హర్షవర్దన్ ప్రసాద్ కార్యకర్తలు, నాయకులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కార్యకర్తలు, నాయకులు పడాల భూదేవికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసహనానికి గురైన పరిశీలకుడు.. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడును సమావేశం నుంచి వెళ్లిపోవాల ని హెచ్చరించారు. దీంతో క్యాడరంతా పరిశీలకుడి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత అక్కడే ఉన్న భూదేవి వైపు దూసుకెళ్లారు. కొంతమంది టీడీపీ నాయకు లు ఆమెకు అడ్డుగా నిలిచారు. పరిశీల కుడు హర్షవర్దన్ ప్రసాద్ సమావేశం నుంచి బయటకు వచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన వద్దకు వచ్చి సమావేశం జరిపించాలని కోరారు. పార్టీ కోసం కష్టపడుతున్న వారిని పక్కనపెట్టి వైసీపీకి కోవర్టులుగా ఉన్న వారికి నామినేటెడ్ పదవులు దక్కేలా భూదేవి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇటీవల ఏఎంసీ వైస్ చైర్మన్‌తో పాటు ఐదుగురు డైరెక్టర్ల పదవులను తన అనుచరులకు కట్టబెట్టారని రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, నాయకులు జాడ శ్రీధర్, గంటా సంతోష్ తదితరులు తెలిపారు. తక్షణమే ఆ పదవులకు రాజీనామా చేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు దక్కేలా చూడాలన్నారు.

నిరసన ర్యాలీ..

టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవిని తొలగించాలని టీడీపీ వీరఘట్టం మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో పాలకొండలో నిరసన ర్యాలీ చేపట్టారు. టీడీపీ నాలుగు మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, తెలుగు యువత అధ్యక్షులు, క్లస్టర్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన గిరిజన విద్యార్థులు


నధవర్ధన్ (137) అఖిల్ (900) జగదీశ్వరరావు (2864) అభిరామ్ (3077) లోకేష్ (6299)

సీతానగరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగింపేట ప్రతిభా జూనియర్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటారని ప్రిన్సిపాల్ ధర్మారావు శనివారం తెలిపారు. ఎస్.నధవర్ధన్ నిహాల్ ఆల్ ఇండియా స్టేట్ ర్యాంకు 137 సాధించాడని, అలాగే ఎస్.అఖిల్ 900వ ర్యాంకు, పి.జగదీశ్వరరావు 2864, కె.అభిరామ్ 3077, ఎ.లోకేష్ 6299 ర్యాంకులు సాధించినట్టు ఆయన చెప్పారు.

● సాలూరు: జోగంపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకుని జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటిన గిరిజన విద్యార్థులను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం అభినందించారు. ఈసందర్భంగా ఎస్.నందవర్ధన్(137), అఖిల్(900), జగదీశ్వరరావు (2864)లను ఆమె సత్కరించారు.

పార్వతీపురంలో 'రన్ ఫర్ జీసస్'



ర్యాలీలో పాల్గొన్న జిల్లా పాస్టర్ల సంఘ సభ్యులు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు పునరుత్థానం సందర్భంగా జిల్లా పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాతబస్టాండ్ కూడలి నుంచి చర్చివీధి కూడలి వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిషప్ తిమోతీ, రెవరెండ్ పాస్టర్ సూర్యప్రకాష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు అరటి ధ్వంసం

- నష్టపోయిన రైతులు


నేలకొరిగిన అరటి పంట

సాలూరు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలంలో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో అరటి పంట ధ్వంసమయ్యింది. అరటి రైతులు శనివారం తమ పొలాలకు వెళ్లి పరిశీలించుకోగా పలు చోట్ల అరటి పంట నేలకొరిగి ఉంది. పసుపువానివలసలో సాయి అనే రైతుకు చెందిన ఏడు ఎకరాల్లో అరటి పంట మొత్తం ధ్వంసమైంది. మరో రెండు నెలల్లో పంట చేతికొస్తుందనగా గాలులకు పంట ధ్వంసం కావడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు వెయ్యి రూపాయల సబ్సిడీతో వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తులను కోరుతున్నట్టు మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాదరావు తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాయితీ పరికరాలు పొందేందుకు ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

గిరిజన సహకార సంస్థ ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయాలి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ద్వారా గిరిజనుల వద్ద నుంచి జీడిపిక్కలు కొనుగోలు చేయాలని ఏపీ గిరిజన సంఘం నాయకుడు కోలక అవినాష్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడారు. జిల్లా గిరిజన ప్రజలు జీడి ఫలసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ కారణంగా జీసీసీ ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేసి గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

గౌతు లచ్చన్నకు నివాళి

గరుగుబిల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించారు. నాగూరు, ఉల్లిభద్ర ప్రాంతాల్లోని లచ్చన్న విగ్రహాలకు రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధుసూదనరావు, టీడీపీ ప్రతినిధులు ఎం.నారాయణస్వామి, బి.సత్యనారాయణ, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

గరుగుబిల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 'భూమి ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామ'ని రీజనల్ థీమాటిక్ లీడ్ (ఆర్‌టీఎల్) ప్రకాష్ అన్నారు. సంతోషపురం రైతుసేవా కేంద్రం వద్ద శనివారం ప్రకృతి వ్యవసాయ రైతులకు నవధాన్యాల సాగు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు ఎన్‌ఎఫ్‌ఏ ఎ.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జి వి.పోలినాయుడు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చెరువుల ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బడే మృత్యుంజయరావు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి రెవెన్యూ పరిధిలో బొత్సవాని చెరువు, మద్రాపువాని చెరువు, శిరాపువాని బందతో పాటు పలు చెరువులు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. ఎట్టకేలకు తహసీల్దార్ పి.బాల స్పందించి ఆక్రమణలను తొలగించేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. శనివారం పలు ఆక్రమణ ప్రాంతాల్లో వీఆర్వో బుచ్చిబాబు, సర్వేయర్ పి.రామ్‌మోహనరావులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు.